



మల్దకల్‌లో కొనసాగుతున్న రథోత్సవం

కనుల పండువగా మహా రథోత్సవం

» జనసంద్రంగా మల్దకల్, చిన్నరాజమూర్

7

కొట్ర ఫీల్డ్ అసిస్టెంట్

సస్పెన్షన్

» ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు చర్యలు

వెల్దండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని కొట్ర గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్యాంపూరి చెన్నయ్య విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడు. ఈ విషయంపై గ్రామానికి చెందిన ఎస్.రమేశ్ అనే వ్యక్తి ఈనెల 3న ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అతడిని సస్పెండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ డీఆర్‌డీఏ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి తెలిపారు. దీనిపై చెన్నయ్య వారంలోగా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని, సస్పెన్షన్‌ను తక్షణమే అమలు చేయాలని ఆదేశించినట్లు వివరించారు.

ఫ్యామిలీ 'పంచాయతీ'

» ఎన్నికల బరిలో కుటుంబ సభ్యులు

» చౌలతండాలో తల్లీకూతుళ్ల పోటీ

» చేగుంట గ్రామంలో అత్తా కోడళ్లు

7

వెయ్యి లోపే ఓటర్లు

» కొల్లాపూర్ నియోజకవర్గంలో చిన్న పంచాయతీలు

7

అంతకుమించి..

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఖర్చుకు వెనుకాడని అభ్యర్థులు

- మేజర్ జీపీల్లో రూ.కోటి వరకూ ఖర్చు చేయడానికి రెడీ
- ఏకగ్రీవాల్లోనూ ఇదే తంతు..
- ఎమ్మెల్యేల స్థాయిలో హామీలు
- ఈగోతో ఖర్చు.. గెలిచి వస్తేనే డబ్బులు అంటున్న ఎమ్మెల్యేలు



మహబూబ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికలు కీలక దశకు చేరుకుంటున్నాయి. మొదటి విడత అభ్యర్థులు బరిలోకి దిగి ప్రచారం చేస్తుండగా.. రెండో విడత అభ్యర్థులు సంసిద్ధులవుతున్నారు. మూడో విడత మండలాల్లో కూడా రాజకీయాలు రసవత్తరంగా ఉన్నాయి. అయితే గతంలో కంటే ఈసారి ఎన్నికలు భిన్నంగా జరుగనున్నాయి. పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ఓవైపు గ్రామాల్లో బలంగా ఉంటే.. మరోవైపు పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పోటీ ఎక్కువగా ఉంది. ఎలాగైనా స్థానిక సంస్థల్లో తామే గెలుపొందాలనే సంకల్పంతో అభ్యర్థులు కష్టపడుతున్నారు. అయితే పోటీ ఎక్కువగా ఉంటే ఖర్చు పెరగడం సహజం. కానీ ఈసారి ఎమ్మెల్యే ఎన్నికలకు మించిన ఖర్చు పంచాయతీల్లో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత నుంచీ ఏకగ్రీవాల కోసం వేలం పాటల్లో కూడా ఈ తంతు చూశాం. హన్వాడ మండలం టంకరలో అయితే వేలం పాట రూ.కోటి దాటిన విషయం అందరికీ తెలిసిందే. గద్వాల జిల్లాలో రూ.60 లక్షల వరకు పలికిన గ్రామాలు ఉన్నాయి. వర్గపోరుతో ఏకగ్రీవాలు

(మిగతా 7లో..)



మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం రాణిపేటలో జొన్న రొట్టెలు కాలుస్తున్న సర్పంచు అభ్యర్థి



అభివృద్ధికి బాండ్ పేపర్

ఇదిలా ఉంటే ఎమ్మెల్యేల స్థాయిలో అలవికాని హామీలు కూడా ఇస్తున్నారు. గద్వాల జిల్లా గట్టు మండలం సుల్తాన్‌పూర్‌లో సర్పంచు అభ్యర్థి తాను చేసే పనులపై బాండ్ పేపర్ రాసి మరీ ఇవ్వగా.. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం పగిడ్యాలలో కూడా అభ్యర్థి కవిత బాండ్ రాసిచ్చారు. మాజీ సర్పంచులు పాత బిల్లులు రాక.. అప్పులపాలై ఇబ్బందులు పడుతున్న విషయం కళ్లెదుట కనిపిస్తున్నా.. కొత్త అభ్యర్థులు, కొందరు మాజీలు కూడా ఖర్చుకు వెనుకాడకపోవడం గమనార్హం.



విదేశాల నుంచి వచ్చి..

బిజినేపల్లి మండలం లట్టుపల్లి సర్పంచు అభ్యర్థిగా కమతం నందిని అమెరికా నుంచి వచ్చి పోటీలో నిలిచారు. గద్వాల మండలం బీరెల్లి గ్రామానికి చెందిన కవిత కూడా ఆస్ట్రేలియాలో కొడుకు దగ్గర నుంచి వచ్చి నామినేషన్ వేశారు. పెబ్బేరు మండలం ఏటిగడ్డ శాఖాపూర్‌లో సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న గ్రీష్మా, ఎంబీబీఎస్ చేస్తున్న కేఎన్ నిఖిత పోటీ చేస్తున్నారు.

జోగుళాంబ ఆలయ అభివృద్ధికి రూ. 347 కోట్లు

» తక్షణ పనులకు రూ.35 కోట్లు అవసరమని గుర్తింపు

» ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి



దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌తో మాట్లాడుతున్న జి.చిన్నారెడ్డి

గద్వాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే 5వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న జోగుళాంబ అమ్మ వారి ఆలయ అభివృద్ధికి రూ.347 కోట్లతో ప్రణాళికను రూపొందించినట్లు ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధిపై హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, స్థపతి గోవిందహరి, శిల్పి సూర్యనారాయణ మూర్తిలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగుళాంబ గద్వాల జిల్లాలో తుంగభద్ర నది పక్కన వెలసిన జోగుళాంబ ఆలయ అభివృద్ధికి రూ.347 కోట్లతో ప్రణాళిక తయారు చేశామని తెలిపారు. బాలాలయం, వజ్ర లేపనం, కుంభాభిషేకం తదితర పనులను తక్షణం చేపట్టాల్సి ఉందని, అందుకు రూ.35 కోట్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ప్రణాళిక మేరకు తొలి దశలో రూ.138.40 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రెండవ దశలో రూ.117.60 కోట్లు, మూడవ దశలో రూ. 91 కోట్లతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రత్యేక సమావేశం నిర్వహించి, నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమీక్షా సమావేశంలో ముఖ్యకార్యదర్శి, స్థపతితో పూర్తి విషయాలు చర్చించామని తెలిపారు.

కాంగ్రెస్‌కు భంగపాటు తప్పదు

» మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అమలు చేయలేని, మోస పూరితమైన 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై అభ్యర్థులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యకర్తలందరూ సంఘటితంగా ఉండి బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రశ్నించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సామ్యా నాయక్, మాజీ సర్పంచులు క్యామ వెంకటరమణ, కృష్ణయ్య గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకు

నామినేషన్లు

» చివరి రోజు భారీగా దాఖలు

» క్యూలైన్లలో వేచి ఉన్న అభ్యర్థులు



అంకిరోనిపల్లి గ్రామంలో నామినేషన్ వేసేందుకు క్యూలైన్‌లో నిలుచున్న అభ్యర్థులు

గద్వాల/ వనపర్తి/ డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మూడవ దశ నామినేషన్ల స్వీకరణ శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. చివరి రోజు కావడంతో నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు భారీగా వచ్చారు. దీంతో అర్ధరాత్రి వరకు స్వీకరణ కొనసాగింది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఎర్రవల్లిలో సర్పంచుకు 84, వార్డు స్థానాలకు 249 నామినేషన్లు వచ్చాయి. ఇటిక్యాలలో సర్పంచుకు 46, వార్డు మెంబర్లకు 176 వచ్చాయి. అలంపూర్‌లో సర్పంచుకు 53, వార్డు మెంబర్లకు 188 వచ్చాయి. ఉండవెల్లి, మానవపాడు మండలాలతో పాటు, ఎర్రవల్లి మండలంలోని ధర్మవరంలో నామినేషన్ల స్వీకరణ రాత్రి 10.30 గంటల తర్వాత కూడా కొనసాగింది.

- వనపర్తి జిల్లాలోని వీపనగండ్ల మండలంలో 14 సర్పంచ్ స్థానాలకు 106, శ్రీరంగాపూర్ మండలంలో 8 పంచాయతీల్లో 60 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పాన్‌గల్, చిన్నంబావి, పెబ్బేరు మండలాల్లో నామినేషన్ల పర్వం అర్ధరాత్రి వరకూ కొనసాగే అవకాశం ఉంది.
- నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని 7 మండలాల్లో మూడో విడత ఎన్నికలు జరుగనున్నాయి. బల్మూరు మండలంలో సర్పంచు స్థానాలకు 106, వార్డు సభ్యులకు 464, చారగొండ మండలంలో సర్పంచు స్థానాలకు 78, వార్డు స్థానాలకు 267 నామినేషన్లు దాఖలయ్యాయి. పదర మండలంలో సర్పంచు స్థానా లకు 34, వార్డు స్థానాలకు 194 నామినేషన్లు వచ్చాయి. మిగతా మండలాల్లో నామినేషన్ల స్వీకరణ 11 గంటల తర్వాత కూడా కొనసాగింది.

సఫారీ పర్యాటకులకు

కనిపించిన పెద్దపులి

» ఆనందంలో మునిగిపోయిన టూరిస్టులు



అడవిలోని మట్టి రోడ్డుపై దర్జాగా కూర్చున్న పెద్దపులి

మన్ననూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలో సఫారీ పర్యాటకులకు పెద్దపులి కనిపించి కనువిందు చేసింది. హైదరాబాద్ కు చెందిన యువకులు నాగర్‌కర్నూలు జిల్లా పర్హాబాద్ బేస్ క్యాంపు నుంచి ఆఫ్‌లైన్ సఫారీ వాహనంలో శుక్రవారం ఉదయం పర్హాబాద్ వ్యూపాయింట్‌కు వెళ్లి గుండం అటవీ మార్గంలో తిరిగి బయలుదేరారు. ఈ సందర్భంలో సోలార్ వాచ్‌టవర్ సమీప అడవిలోని పొదల నుంచి పెద్దపులి కదలికలను గమనించిన సఫారీ జీపు డ్రైవర్ యాదయ్య వాహనాన్ని నిలుపగా, యువ పర్యాటకులు తమ సెల్‌ఫోన్లలో పెద్దపులి చిత్రాన్ని బంధించి సంబురపడిపోయారు. పెద్దపులి సంచరించిన విషయాన్ని స్థానిక అటవీ అధికారులు ధ్రువీకరించారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

» అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలుర కబడ్డీ టోర్నీ



తలపడుతున్న మహబూబ్‌నగర్-రాజన్న సిరిసిల్ల బాలుర జట్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, క్రీడలకు కేరాఫ్ మహబూబ్‌నగర్ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలుర కబడ్డీ టోర్నీని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండేళ్లుగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. కబడ్డీ క్రీడకు క్రేజ్ ఉందని చెప్పారు. ప్రీమియర్ లీగ్ జరుగుతున్నాయని, కోట్ల మంది దేశవ్యాప్తంగా వీక్షిస్తున్నారని అన్నారు. ప్రీమియర్ లీగ్‌కు జిల్లా క్రీడాకారులు ఆడాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించడం పట్ల కబడ్డీ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని అన్నారు. అతిథులకు మంచి సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులను కోరారు. ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి క్రీడాకారుడు కాబట్టే రాష్ట్రంలో క్రీడాభివృద్ధి జరుగుతుందని అన్నారు. కబడ్డీ

(మిగతా 6లో..)



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 139.00
హోల్ సేల్	: 147.00
డ్రెస్డ్	: 233.00
స్కిన్ లెస్	: 266.00

ఒకటి మీకు.. ఒకటి మాకు..

» పదవులను పంచుకుంటున్న పార్టీలు

7

పంచాయతీ ఎన్నికలపై..

పోలీసు నిఘా

» సోషల్ మీడియాలో ట్రోలింగ్‌పై ప్రత్యేక దృష్టి

» ఫేక్ న్యూస్ పోస్టు చేసే వారిపై చర్యలు

» జిల్లా వ్యాప్తంగా నాలుగు చెక్‌పోస్టులు

» 102 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు



నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు (ఫైల్)

గద్వాల క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా కొనసాగేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. మొత్తం మూడు దశల్లో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా 102 సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు.

నాయకులు, అనుచరులపై నజర్


గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో ఉన్న కొందరు నాయకులు ఇప్పటి నుంచే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో వారితో పాటు, అనుచరుల కదలికలపై నిఘా వేసినట్లు సమాచారం. ఓటర్లను ఆకర్షించేందుకు మద్యం, డబ్బు, ఇతర వస్తువుల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందుకోసం జిల్లా పరిధిలో 4 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

అలాగే పాత నేరస్థులు, రౌడీషీటర్లు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై నిఘా ముమ్మరం చేశారు. గతంలో వివిధ నేరాలతో సంబంధమున్న 204 మందికి ఇప్పటికే బైండోవర్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. దీంతో పాటు గ్రామాలకు కొత్తగా వస్తున్న వారి కదలికలను కూడా గమనిస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు

పంచాయతీ ఎన్నికల్లో ప్రలోభాలకు లోనుకాకుండా, స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటు ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేస్తూ కళాబృందాలు, పీటీంల ద్వారా ప్రతీ రోజు రెండు గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. అలాగే ఎన్నికల కోడ్ అమలు తీరు, ఉల్లంఘనలపై తీసుకునే చర్యలపై ప్రజలకు తెలియజేస్తున్నారు.

సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా



గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా జరిగేలా ప్రజలు సహకరించాలి. సోషల్ మీడియా వేదికలపై తప్పుడు, రెచ్చగొట్టే పోస్టింగులు చేసే వారిపై చర్యలకు రంగం సిద్ధం చేశాం. ఎవరైనా ఫేక్ న్యూస్ ప్రచురించినా, వైరల్ చేసినా క్రమ శిక్షణా చర్యలు తప్పవు. గ్రామాల్లో ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

- శ్రీనివాసరావు, ఎస్పీ, జోగుళాంబ గద్వాల

ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత

» వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఈవీఎం గోదాం పరిశీలనలో అధికారులు, సిబ్బందితో వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈవీఎంల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. వనపర్తి మండల తహసీల్దార్ కార్యాలయం వెనుకనున్న ఈవీఎం గోదాంను శుక్రవారం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సీసీ కెమెరాల నిర్వహణ, పోలీసు బందోబస్తు, అధికారులు, సిబ్బంది విధులు తదితరాలను తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పెద్దిరాజు, కొత్తపల్లి శంకర్, కుమారస్వామి, త్రినాథ్, పరమేశ్వర చారి, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

స్వరూపారాణికి పారాయణ ప్రభ బిరుదు



స్వరూపారాణికి వాసవీ శతాధిక ఆలయ పారాయణ ప్రభ బిరుదును అందజేసిన కవిరత్న డాక్టర్ చింతల శ్రీనివాస్

జడ్చర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వాసవీమాత క్షేత్రాలలో 100కు పైగా వాసవీమాత పారాయణం చేసిన జడ్చర్ల ఆడబిడ్డ, వాసవీ పారాయణ ప్రచార సేవా సమితి ఫౌండర్ అండ్ చైర్‌పర్సన్‌కు జూలూరు స్వరూపారాణికి పారాయణ ప్రభ బిరుదు అందచేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి సమీపంలోని తెలంగాణ తిరుపతి స్వర్ణగిరి క్షేత్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కవిరత్న డాక్టర్ చింతల శ్రీనివాస్ రచించి విడుదల చేసిన స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామిపై ఐదు గేయాలను రిలీజ్ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్వరూపారాణికి శ్రీవాసవీ శతాధిక ఆలయ పారాయణ ప్రభ బిరుదును అందచేశారు. పలువురు భక్తులు, వాసవీ పారాయణ ప్రచార సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు భాషపై ప్రతీ ఒక్కరు పట్టు సాధించాలి

» కవి, రచయిత డాక్టర్ గుడేలి శ్రీనయ్య



పాఠశాలకు పుస్తకాలు బహూకరిస్తున్న కవి, రచయిత, తెలుగుభాష ఉపాధ్యాయుడు డాక్టర్ గుడేలి శ్రీనయ్య

కొల్లాపూర్ ,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల దశ నుండే విద్యార్థులు తెలుగు భాషపై పట్టు సాధించాలని కవి రచయిత, తెలుగు భాష ఉపాధ్యాయులు డాక్టర్ గుడేలి శ్రీనయ్య విద్యార్థులకు పిలుపునిచ్చారు. కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న కవి రచయిత డాక్టర్ గుడేలి శ్రీనయ్య రచించిన పుస్తకాలు చినుకు పూలు, పద్య కౌముది, సిరుల మూట శతకం అదే విధంగా కథల పుస్తకాలు పాఠశాలకు బహూకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మునీశ్వర్ మాట్లాడారు. స్వచ్ఛందంగా తెలుగు మాట్లాడటం, తెలుగులో రాయడం, తెలుగులో కవితలు, పద్యాలు నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు రంగినేని శ్రీధర్, రాము పాల్గొన్నారు.

గోకారం బాధిత రైతాంగ ఉద్యమానికి సంఘీభావం

» పాలమూరు అధ్యయన వేదిక

పాలమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోకారం బాధిత రైతాంగ ఉద్యమానికి సంఘీభావంగా పాలమూరు అధ్యయన వేదిక మద్దతు తెలుపుతున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ యం.రాఘవాచారి ప్రకటించారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జూరాల ప్రాజెక్టునుంచి శ్రీశైలం ప్రాజెక్టు వైపు మార్చడంతో ఈ సమస్య ముందుకు వచ్చిందన్నారు. దీనిని ఒక అవకాశంగా తీసుకుని కొద్దిమంది ఇంజనీర్లు శ్యాంప్రసాద్‌రెడ్డి, సత్తిరెడ్డిలు పాలమూరు-డిండి అనే ఎత్తిపోతల పథకాన్ని ముందుకు తెచ్చారని పేర్కొన్నారు. ఈ తప్పుడు ప్రతిపాదనల వల్ల పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాకు తీరని నష్టం వాటిల్లే దుస్థితి దాపురించిందన్నారు. ప్రస్తుత నాగర్‌కర్నూల్ జిల్లాలో వేలాది ఎకరాల భూముల ముంపు బారిన పడటంతో రైతులు వీధిపాలవుతున్నారని తెలిపారు. గోకారం చెరువును కూల్చి భారీగా నిర్మించే రిజర్వాయర్‌లో స్థానిక రైతులకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. ఇక్కడి భూములు ముంచి నల్లగొండకు నీరు తరలించుకోవడానికే గోకారం రిజర్వాయర్ కడుతున్నారని ఇక్కడి రైతులు వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఎనిమిదేళ్లనుంచి దీనిపై రైతులు పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టుదలతో పాలమూరు-డిండి పనులు నడిపిస్తూ జిల్లాకు నష్టం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

గోకారం రిజర్వాయర్ బాధిత రైతాంగ పోరాటం న్యాయమైందన్నారు. ఆ రైతులకు న్యాయం చేయాలని పాలమూరు-డిండి పథకం రద్దుచేసి నల్లగొండ జిల్లాకు అవసరమైన నీటిని ఆ జిల్లా వనరుల నుంచి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోలులో తేమశాతం గుర్తించాలి

» డీఎస్‌వో నరసింహారావు



మంగనూర్‌లో మిల్లర్లు సేకరించిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ డీఎస్‌వో

బిజినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి కొనుగోలు చేసే ధాన్యంలో తేమ శాతాన్ని కచ్చితంగా గుర్తించాలని డీఎస్‌వో నరసింహారావు మిల్లర్లను ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని మంగ నూర్‌లో శుక్రవారం మిల్లర్లు సేకరించిన ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించి, వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని సేకరిస్తేనే ప్రజలకు మంచి బియ్యాన్ని సరఫరా చేసే అవకాశం ఉం టుందన్నారు. ధాన్యంలో తేమ అధికంగా ఉంటే, నూకలుగా మారే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆయన వెంట సివిల్ సప్లై జిల్లా అధికారులు రాజేందర్, రాఘవేందర్ రెడ్డి ఉన్నారు.

మద్యం అక్రమ రవాణా

» ఇద్దరిపై కేసు నమోదు

కోడేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కోడేరు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండలంలోని రాజాపూర్, రేకులపల్లి గ్రామాల మధ్య పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో వాల్యానాయక్ తండాకు చెందిన రాజు నాయక్, సురేందర్‌నాయక్‌లు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆపి తనిఖీ చేయగా, 34 లీటర్ల మద్యం లభించింది. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో

ముగ్గురికి జైలు శిక్ష

కల్వకుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలోని తిలక్‌నగర్‌కు చెందిన భీమయ్యకు 5 రోజుల జైలు శిక్ష, రూ. 350 జరిమానా, గుండూరుకు చెందిన కానుగుల అనిల్‌కుమార్‌కు ఒక రోజు జైలు శిక్ష, రూ. 100 జరిమానా విధిస్తూ న్యాయాధికారి కావ్య తీర్పు వెల్లడించారు. అలాగే ఉత్తరప్రదేశ్‌కు చెందిన దీరేందర్‌గుప్తాకు ఒక రోజు జైలు శిక్ష, రూ. 600 జరిమానా విధించినట్లు ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు.

వేటాడేస్తున్నారు!




కృష్ణానది పరివాహక ప్రాంతం

» జూరాల పరివాహక ప్రాంతంలో జింకల వేట

అమరచింత, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జూరాల ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో సంచరిస్తున్న కృష్ణ జింకలు దినదినం వేటగాళ్ల చేతిలో బలి అవుతున్నాయి. సంబంధిత అధికారుల అలసత్వం ఆసరాగా చేసుకున్న వేటగాళ్లు కృష్ణ జింకలతో పాటు ఇతర జంతువులను సైతం రాత్రివేళలో తిష్ట వేసి వెంటాడి పట్టుకుని అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు తెలిసింది. గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ వ్యవహారంపై అధికారులు ఉదాసీనతనే కారణమని పలువురు విమర్శిస్తున్నారు.

● అధికారుల పర్యవేక్షణ లోపంతోనే..

కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో వన్య ప్రాణులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తుందని పలువురు విమర్శిస్తున్నారు. వన్యప్రాణులు పట్టుబడి ఎక్కడన్నా గాయపడితే అది ఎవరైనా సమాచారం ఇస్తేనే గాని అధికారులు ఈ ప్రాంతానికి వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో కృష్ణా జింకలపై దృష్టి సారించిన అక్రమార్కులు హైదరాబాద్ తదితర సుదూర ప్రాంతాల నుంచి సంపన్న వర్గాల వ్యక్తులు, యువకులు ఇక్కడే తిష్ట వేసి రాత్రివేళలో వేటగాళ్ల సహకారంతో బలి చేస్తున్నట్లు సమాచారం. కృష్ణ జింకలతో పాటు ఇతర అడవి జంతువులు రాత్రివేళలో గుంపులుగా సంచరిస్తుంటాయి. దీంతో ఈ ప్రాంతంలో కొంతమంది వేటగాళ్ల సహకారంతో కృష్ణ జింకలను వేటాడి స్వాధీన పరుచుకుంటున్నట్లు సమాచారం. ప్రభుత్వం జంతువుల వేటను నిషేధించినప్పటికీ వాటి అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నందుకే వేటగాళ్లు వెంటాడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. వేటగాళ్లకు జంతువులను వేటాడి సుదూర ప్రాంతాలకు తరలించి కాసుల వర్షం కురిపించుకుంటున్నారని సమాచారం. కృష్ణ పరివాహక ప్రాంతంలో సంచరిస్తున్న కృష్ణ జింకలతో పాటు ఇతర జంతువులను అధికారులు కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



● వన్య ప్రాణులను సంరక్షించాలి

కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో సంచరిస్తున్న వన్య ప్రాణులను అధికారులు సంరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఈ ప్రాంతంలో కృష్ణ జింకలు, నెమళ్లు, కుందేళ్లు, తదితర వన్య ప్రాణులు ఉన్నాయి. పొలాల్లో కనిపించే వన్యప్రాణులను వేటగాళ్ల నుంచి కాపాడాలి.

\- కమలాకర్ గౌడ్, అమరచింత

● వందల సంఖ్యలో కృష్ణ జింకలు

జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో పాటు ముందు భాగంలో ఉన్న పరివాహక గ్రామాల్లో వన్యప్రాణులు వందల సంఖ్యలో సంచరిస్తున్నాయి. చింతరెడ్డిపల్లి, ఈర్లదిన్నె, మూలమల్ల, నాగల్‌కడుమూర్, చంద్రఘడ్, ధర్మాపూర్, ఆత్మకూరు మండలంలోని మూలమల్ల, మల్లాపురం, జూరాల, మొట్లపల్లి, గుంటిపల్లి, ఆరేపల్లి, కత్తెపల్లి, రేచింతల, నర్వ మండలం పెద్దకడుమూర్, ఎల్లంపల్లి, బెకర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, రాంపూర్, చిన్నచింతకుంట మండలం ఉంద్యాల, కురుమూర్తి స్వామి జాతర గుట్ట శివారులోని పలు గ్రామాల్లో జింకలతో పాటు నెమలి, కుందేలు తదితర వన్య ప్రాణులు, జంతువులు సంచరిస్తూ ఉంటాయి.

● అధికారులకు అప్పగించాలి



వన్య ప్రాణులను హతమార్చడం గాని, వేటాడడం గానీ చేయరాదు. ఒకవేళ పొలాల్లో వన్య ప్రాణులు లభిస్తే ఫారెస్టు అధికారులకు అప్పగించాలి. వన్య ప్రాణుల చట్టంపై ప్రతీ ఒక్కరికి అవగాహన తప్పనిసరి. ఎవరైనా వేటాడడం కానీ చంపడం గాని చేస్తే తమ దృష్టికి తీసుకురావాలి.

\- స్వాతి, ఎస్ఐ, అమరచింత

కళామతల్లి సేవలో ఆత్మానందం

» ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

» కళాకారుడు కేశవాచారికి ఘన సన్మానం



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కళాకారుడు కేశవాచారిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, కళాకారులు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కళాకారుడు.. కళామతల్లి సేవలో తరిస్తూ తన జీవిత సమస్యలను మరచి ఆత్మానందాన్ని పొందుతాడని ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ఘంటసాల 103వ జయంతిని పురస్కరించుకుని కందనూలు కళా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రాత్రి సీనియర్ కళాకారుడు కేశవాచారిని ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ గోరటి వెంకన్న హాజరై కళాకారుడు కేశవాచారిని శాలువా, మెమొంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 1980 నుంచి పౌరాణిక నాటకాలకు పునర్ వైభవం తీసుకురావడానికి కేశవాచారితో కలిసి తను కృషి చేశానన్నారు. అనేక వ్యయ ప్రయాసాల ఓర్చి టికెట్‌తో ఆ కాలంలో నాటకాలు ప్రదర్శించామని, నాటకాల్లో కేశవాచారి పాత్రలు గణనీయంగా ఉండేవని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ మండలి సభ్యుడు ముచ్చర్ల దినకర్, జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి సీతారంనాయక్, జిల్లా సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆర్.సత్యం, సీనియర్ కళాకారుడు, కందనూలు కళా సేవా సమితి వ్యవస్థాపక సభ్యుడు అరుణ్‌కుమార్, కళాకారులు డి.రాములు, సురేష్‌బాబు, నర్సింహారెడ్డి, మురళీధర్‌రావు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పాండుచారి, స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుచారి, గాయకులు ఇద్రీస్, కృష్ణ, నర్సింహులు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, టి.కె.చారి, సునందచారి, రమేష్, సరిత, ఉదయమ్మ, యాదమ్మ, వెంకట్రావమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీయూలో ఈ సెంట్రల్ వాల్యుయేషన్ సెంటర్



ఈ సెంట్రల్ వాల్యుయేషన్ సెంటర్‌కు రిబ్బన్ కటింగ్ చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబు

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలోని పరీక్షల నిర్వహణ బ్రాంచ్‌లో ఈ సెంట్రల్ వాల్యుయేషన్ సెంటర్‌ను శుక్రవారం పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీయూలో నూతన కోర్సులు ఏర్పాటు కావడంతో వాల్యూయేషన్ తొందరగా పూర్తి చేసేందుకు విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులకు ఈ సెంట్రల్ వాల్యూయేషన్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. పరీక్షా ఫలితాలు తొందరగా ఇవ్వడంతో విద్యార్థులు ఉద్యోగాలు పొందడానికి అవకాశం ఉంటుందని అన్నారు. పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ అనురాధారెడ్డి, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేజారిన ఆభరణాలు చేతికందించిన పోలీసులు

» సీసీ ఫుటేజీతో గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు

» బాధితురాలికి పోగొట్టుకున్న సొత్తు అప్పగింత



బాధితురాలికి ఆభరణాలు అందిస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆభరణాలు పోగొట్టుకున్న బాధితురాలికి సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు కనిపెట్టి అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ రూరల్ మండలం మణికొండకు చెందిన జ్యోతి శుక్రవారం మధ్యాహ్నం కోర్టువద్ద ఆటో ఎక్కి, క్లాక్‌టవర్‌లో దిగింది. దిగిన కొద్దిసేపటికీ తన బ్యాగు ఆటోలో మరిచిపోయినట్లు గుర్తించింది. ఆ బ్యాగులో 5గ్రాముల బంగారం, 12 తులాల వెండి ఆభరణాలు ఉన్నాయి. ఆందోళన చెందిన బాధితురాలు నగరంలోని ట్రాఫిక్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భగవంతురెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు సంఘటన చోటు చేసుకున్న ప్రాంతానికి సంబంధించిన సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. పుటేజీలో వివరాల ఆధారంగా జ్యోతి ప్రయాణం చేసిన ఆటోను గుర్తించారు. అనంతరం ఆటో డ్రైవర్ హరిచందర్‌ను సంప్రదించి స్టేషన్‌కు పిలిపించారు. ఆటో డ్రైవర్ తనవద్ద ఉన్న ఆభరణాల బ్యాగును ట్రాఫిక్ ఎస్ఐ బాల్యానాయక్‌కు అప్పగించాడు. ఎస్ఐ పర్యవేక్షణలో ఆభరణాల బ్యాగును జ్యోతికి అందించారు. దీంతో పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయమై ఎస్పీ డి.జానకి పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించారు.

పోలీస్ చెక్‌పోస్టు ఆకస్మిక తనిఖీ



మంగనూర్‌లో చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్

బిజినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని మంగనూర్‌లో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టును శుక్రవారం ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించి, పోలీసులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం అక్రమంగా రవాణా జరిగే అవకాశం ఉన్నందున్న అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, అనుమానిత వ్యక్తులను తనిఖీ చేసి, వివరాలు సేకరించాలన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి వస్తువులు రవాణా జరకుండా కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

సర్పంచు ఎన్నికల బహిష్కరణ

» రిలే నిరాహార దీక్షలో ఎర్రవల్లి గ్రామస్థులు



రిలే నిరాహార దీక్ష చేస్తున్న భూ నిర్వాసితులు

చారకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా ప్రజలు సర్పంచు ఎన్నికలను బహిష్కరించారు. డిండి - నార్లాపూర్ ఎత్తిపోథల పథకంలో భాగంగా మండలంలోని గోకారం వద్ద రిజర్వాయర్ నిర్మించనున్నారు. అందుకోసం ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎర్రవల్లి, ఎర్రవల్లితండా ప్రజలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాలుగవ రోజుకు చేరాయి. మూడో విడతలో ఎన్నికలు జరుగనున్న ఈ గ్రామంలో చివరి రోజు శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. రిజర్వాయర్ నిర్మాణంతో ఎర్రవల్లి, ఎర్రవల్లితండా ముంపునకు గురవుతుండగా, ఎన్నికలు జరిగితే ఏమి ప్రయోజనం ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యాన్ని తగ్గించాలని ఎన్నోమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా స్పందించలేదని వారు ఆరోపించారు. అందుకే తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నామని తెలిపారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో పతకాలు సాధించాలి

» జిల్లా ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి రాంచందర్



రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి రాంచందర్ అన్నారు. ఈ నెల 7న హైదరాబాద్ కొల్లూరులోని డిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఆర్చరీ చాంపియన్ షిప్‌లో టోర్నీకి ఎంపికైన జిల్లా క్రీడాకారులను శుక్రవారం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదువలేదని, ఎంతో మంది క్రీడాకారులు విలువిద్యలో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారని అన్నారు. టోర్నీలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కోచ్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

బాలుర విభాగం: శ్రీవాస్తవ్, విష్ణువర్ధన్, సాయిమణిశ్వర్, చంద్రనీల్‌ఏకలవ్య, మణికంఠ, రామవత్‌రవి, ఎం.రతన్‌సింగ్, ఆనంద్, ఓంప్రకాష్.

బాలికల విభాగం: సమీక్ష, డి.సమీక్ష, సానిబ, సునీతరాథోడ్, అయేషసిద్ధిఖ, శరణి, సాత్విక

జూనియర్ వాలీబాల్ పోటీలకు నల్లమల విద్యార్థి



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నల్లమల విద్యార్థి ఎడ్ల వరప్రసాద్‌వర్మ

అమ్రాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బీకే.తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల వరప్రసాద్‌వర్మ అనే విద్యార్థి జూనియర్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. నవంబరు 29న నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ వాలీబాల్ పోటీల్లో ఈ విద్యార్థి అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి ఈ నెల 16 నుండి 21వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి జూనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు వరప్రసాద్‌వర్మ ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ బాలస్వామి, కోచ్ శివకుమార్, కుటుంబ సభ్యుతోపాటు నల్లమల ప్రాంతానికి చెందిన క్రీడాకారులు, ప్రజలు హర్షం ప్రకటించారు. ప్రస్తుతం ఈ విద్యార్థి రాజన్న సిరిసిల్ల జిల్లాలో తెలంగాణ రాష్ట్రం తరపున నిర్వహిస్తున్న క్యాంపులో శిక్షణ పొందుతున్నాడు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

» రాష్ట్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాజ్యలక్ష్మి



లింగాల మండల కేంద్రంలో నామినేషన్లు పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల జనరల్ పరిశీలకురాలు రాజ్యలక్ష్మి

అచ్చంపేట/బల్మూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని రాష్ట్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం లింగాల మండలంలోని ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని ఆమె ఆర్డీవో మాధవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె నామినేషన్ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు నామినేషన్ పత్రాలను సక్రమంగా పరిశీలించి తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట జిల్లా నోడల్ అధికారి సీతారాం, తహసీల్దార్ వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

● , (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిబంధనల ప్రకారం ఎక్కడా కూడా ఆటంకం లేకుండా సక్రమంగా నామినేషన్లను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల జనరల్ పరిశీలకురాలు రాజ్యలక్ష్మి అధికారులకు సూచించారు. శుక్రవారం బల్మూరు మండల కేంద్రంలోని ఎన్నికల నామినేషన్ల కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. జిల్లా నోడల్ అధికారి వి.సీతారాం, అచ్చంపేట ఆర్డీవో మాధవి, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

(5వ పేజీ తరువాయి)



క్రీడాకారుల వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలన్నారు. అంతకు ముందు క్రీడా పతకాన్ని ఆవిష్కరించి, పోటీలను ప్రారంభించారు. బాలానగర్ ఎస్సీ రెసిడెన్షియల్ విద్యార్థుల బ్యాండ్ ప్రదర్శన ఆకట్టుకుంది. పోటీలకు 33 జిల్లాల నుంచి 34 జట్టు, 500 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారితో పాటు 100 మంది ఆఫీషియల్స్, శిక్షకులు, మేనేజర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కబడ్డీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాసాని వీరేష్ ముదిరాజ్, మద్ది మహేందర్‌రెడ్డి, జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి కురుమూర్తిగౌడ్, ఇండియన్ టీమ్ కోచ్ శ్రీనివాస్‌రెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారుడు మల్లేష్, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ శుభారంభం

రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలుర కబడ్డీ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం ఇండోర్‌స్టేడియంలో మొదట జరిగిన లీగ్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు రాజన్నసిరిసిల్లపై 64-28 స్కోర్ తేడా గెలిచింది. కొత్తగూడెం జట్టు కామారెడ్డిపై 51-40, మేడ్చల్ జట్టు ఖమ్మంపై 58-13, కరీంనగర్ జట్టు మంచిర్యాలపై 62-08 స్కోర్ తేడాతో గెలుపొందాయి.

పంచాయతీ బరిలో ఉన్నత విద్యావంతులు



బొంకూరులో నామినేషన్ దాఖలు చేస్తున్న రవళి



నసరుల్లాబాద్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న పాలకొండ హేమలత

- పోల్కంపల్లిలో ఒకరు బీఈడీ, మరొకరు పీజీ
- కొండేరులో వైద్యురాలు, బొంకూరులో టెకీ

నసరుల్లాబాద్‌లో ఎంబీఏ అభ్యర్థి

మహబూబ్‌నగర్/ ఎర్రవల్లి/ అలంపూరు చౌరస్తా /జడ్చర్ల : డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత వి ద్యావంతులు ఇద్దరు పంచాయతీ ఎన్నికల బరి లో నిలిచారు. ఉద్యోగాల వేటలో ఉన్న వారికి రిజర్వేషన్ల కారణంగా పోటీ చేసే అవకాశం ద క్కింది. మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని పోల్కంపల్లి గ్రామం ఎస్సీ మహి ళకు రిజర్వు అయింది. ఈ స్థానానికి బీఈడీ, డీ ఈడీ చేసిన వెంకటేశ్వరమ్మ కాంగ్రెస్ పార్టీ మద్ద తుతో సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థిగా ఎంఎస్సీ ఆర్గానిక్ కె మెస్ట్రీ చేసిన దివ్య బరిలో నిలిచారు. 2019 ఎన్ని కల్లో వార్డు స్థానానికి పోటీ చేసిన వెంకటేశ్వర మ్మకు ఈ సారి సర్పంచు స్థానానికి పోటీ చేసే అవకాశం దక్కింది.

మరో అభ్యర్థి దివ్య తండ్రి పదిన్నరేళ్ల కాలంగా నీళ్ళు వదిలే పని చేస్తూ నీళ్ళ వెంకటయ్యగా పేరు తెచ్చుకున్నారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండలంలోని కొండేరు గ్రామ పంచాయతీలో సర్పంచ్ స్థానం జనరల్‌కు రిజర్వు అయింది. ఆ స్థానానికి డాక్టర్ శ్రీహరిత శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఆమె భర్త పోతురాజు సోమనాద్రి సోదరుడు బలరాముడు సర్పంచుగా పని చేశారు.

● కర్నూలు నగరానికి చెందిన రవళి ఉండవల్లి మండలం, బొంకూరు గ్రామానికి చెందిన కె.శ్రీరామ్‌ను కులాంతర వివాహం చేసుకున్నారు. ఆమె హైదరాబాదులోని ఎంట్రిక్స్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆ ఉద్యోగాన్ని ఒదులుకొని బొంకూరు బీసీ జనరల్ స్థానంలో సర్పంచు అభ్యర్థిగా శుక్రవారం నామినే షన్ దాఖలు చేశారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం నసరుల్లాబాద్ గ్రామపంచాయతీలో సర్పంచ్ అభ్యర్థిగా ఎంబీఏ పూర్తి చేసిన పాలకొండ హేమలత శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఓ ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న హేమలత బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఆమె భర్త సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పాలకొండ ప్రవీణ్ చందర్, అత్తా మామలు సత్యవతి, ప్రభాకర్‌లు ఆ గ్రామానికి సర్పంచులుగా పనిచేశారు.



పోల్కంపల్లిలో కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్న వెంకటేశ్వరమ్మ, స్వతంత్ర అభ్యర్థి దివ్య



కొండేరు సర్పంచు అభ్యర్థి డాక్టర్ శ్రీహరిత

ఫ్యామిలీ 'పంచాయతీ'

- ఎన్నికల బరిలో కుటుంబ సభ్యులు
- చౌలతండాలో తల్లీకూతుళ్ల పోటీ
- చేగుంట గ్రామంలో అత్తా కోడళ్లు



జానమ్మ(తల్లి) బీఆర్ఎస్ పార్టీ



కొర్ర మన్ని (కూతురు) కాంగ్రెస్ పార్టీ

భూత్పూర్/ కృష్ణ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తల్లీ కూతుళ్ల, అత్తా కోడళ్ల పోటీ పడుతుండటం ఆసక్తికరంగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని చౌలతండా ఆరేళ్ల క్రితం గ్రామపంచాయతీగా మారింది. మొదటి సర్పంచ్‌గా శ్రీనునాయక్ ఎన్నికయ్యారు. ఈ సారి ఆ పంచాయతీ జనరల్ మహిళకు రిజర్వు అయ్యింది. దీంతో శ్రీనునాయక్ తల్లి జానమ్మ బీఆర్ఎస్ మద్దతుతో సర్పంచు స్థానానికి పోటీ చేస్తోంది. ఆమె కుమార్తె కొర్ర మన్ని కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్నారు. జానమ్మ భర్త దేవుజానాయక్ 2006లో (తండా పంచాయతీ కాక ముందు) కర్వెన సర్పంచుగా పని చేశారు.

● నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని చేగుంట పంచాయతీ సర్పంచ్ స్థానం బీసీ మహిళకు రిజర్వు అయ్యింది. ఆ స్థానానికి ఒకే కుటుంబానికి చెందిన అత్తా కోడళ్లు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో అత్త హైమావతి పోలీసు పటేల్, బీజేపీ మద్దతుతో కోడలు విద్యాధరి పోలీస్ పటేల్ ఎన్నికల బరిలో నిలిచారు. వారిద్దరూ శుక్రవారం భారీ సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్ల కాన్వాయ్‌తో వెళ్లి నామినేషన్లు దాఖలు చేశారు.



హైమావతి పోలీసు పటేల్ (అత్త)



విద్యాధరి పోలీస్ పటేల్ (కోడలు)

వెయ్యి లోపే ఓటర్ల సంఖ్య

- కొల్లాపూర్ నియోజకవర్గంలో చిన్న పంచాయతీలు



కృష్ణానది తీరాన నల్లమల నడుమనున్న అమరగిరి గ్రామం

కొల్లాపూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో చిన్న పంచాయతీలు ఉన్నాయి. ఆ గ్రామాల్లో ఓటర్ల సంఖ్య వెయ్యి లోపే ఉంది. కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, కోడేరు, పెంట్లవెల్లి మండలాల పరిధిలో ఈ గ్రామాలున్నాయి. కొల్లాపూర్ మండల పరిధిలోని 18 పంచాయతీల్లో చిన్నదైన అమరగిరిలో 6 వార్డులున్నాయి. 344 మంది జనాభా ఉండగా, 272 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళలు 177 మంది, పురుషులు 167 మంది ఉన్నారు. పెంట్లవెల్లి మండలంలోని 10 గ్రామ పంచాయతీలు ఉండగా, తడకలవారి తండాలోని ఆరు వార్డుల్లో జనాభా 520 మంది ఉండగా, 372 మంది ఓటర్లు ఉన్నారు. కోడేరు మండలంలో 16 గ్రామ పంచాయతీలుండగా, ఠాకూర్ తండాలోని 8 వార్డుల్లో 730 మంది జనాభా ఉండగా, 415 మంది ఓటర్లు ఉన్నారు. పెద్దకొత్తపల్లి మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో ఒకటైన సంజీవపూర్‌లో 500 మంది జనాభా ఉన్నారు. 404 మంది ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామాల్లో రెండో విడతలో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి.


ప్రాణ హాని ఉంది రక్షణ కల్పించండి

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన అభ్యర్థి ఆంజనేయులు

గట్టు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని అభ్యర్థి ఆంజనేయులు శుక్రవారం ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండలంలోని సల్కాపురం పంచాయతీలో సర్పంచ్ స్థానానికి ఆయన పోటీ చేస్తున్నారు. నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలంటూ తనపై కొందరు ఒత్తిడి తెచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారు గట్టు బస్టాండ్ అవరణలో తనపై దాడి చేసేందుకు యత్నించగా, ఎస్ఐ రక్షించారని తెలిపారు. ఎన్నికలు అయిపోయేంత వరకు తనకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

నచ్చిన గుర్తు కోసం ..

మహబూబ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ ఎన్నికలో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ కొన్ని గుర్తులను సీరియల్ ప్రకారంలో కేటాయించింది. ఇందులో అభ్యర్థుల అక్షరమాల ప్రకారం మొదటి గుర్తు ఉంగరం, రెండవది కత్తెర, మూడవది బ్యాట్, నాలుగవది ఫుట్‌బాల్, ఐదవది లేడీస్ హ్యాండ్‌బ్యాగ్, అరవది టీవీ రిమోట్ గుర్తులు ఉన్నాయి. అయితే మొదటి మూడు గుర్తులు అందరికీ బాగా తెలిసినవి .సులువుగా గుర్తుపట్టేవి కావడంతో ఆ గుర్తులు తమకు కేటాయిస్తే ఓటర్ల దగ్గరికి వాటిని సులువుగా తీసుకెళ్ళవచ్చని అభ్యర్థులు భావిస్తున్నారు. ముగ్గురి కన్నా ఎక్కువ మంది పోటీ చేస్తే వారి అక్షరమాల ప్రకారంగా ఐదు, ఆరు గుర్తులు వస్తే, పైన ఉన్న వారిని పోటీ నుంచి తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు బుజ్జగింపులు చేస్తేనే, అంతో ఇంతో ఇస్తేనో పోటీ నుంచి తప్పుకుంటారు. కింద గుర్తులు వచ్చే చోట సీరియల్ ప్రకారం తమకన్నా పైన ఉన్న వారిని తప్పించేందుకు వారి నామినేషన్ ఉపసంహరించుకునేలా బుజ్జగింపులు చేస్తున్నట్లు సమాచారం.



ఒకటి మీకు.. ఒకటి మాకు..

- పదవులను పంచుకుంటున్న పార్టీలు



పిన్నంచర్లలో వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో, తహసీల్దార్, మండల పంచాయతీ అధికారులు

ఆత్మకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో రాజకీయం రసవత్తరంగా మారింది. ఒకటి మీకు.. ఒకటి మాకు అన్నట్లుగా ప్రధాన పార్టీలు పదవులను పంచుకుంటున్నాయి. ఆత్మకూరు మండలంలోని మేడపల్లి, గుంటుపల్లి గ్రామాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ పదవులను కైవసం చేసుకున్నది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఉప సర్పంచ్ పదవులను సొంతం చేసుకున్నాయి. నాయకుల మధ్య ఒప్పందం మేరకు ఆయా గ్రామాల్లో ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలయ్యింది. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుతో మేడపల్లి సర్పంచుగా చెన్నరాయుడు, అదే పార్టీ మద్దతుతో లక్ష్మణ్‌ను గుంటిపల్లి సర్పంచుగా ఎన్నికవడం ఖాయమైంది. అలాగే ఉపసర్పంచు పదవులను కూడా ఆయా పార్టీల మద్దతుదారులు దక్కించుకో నున్నారు. వీటితో మండల పరిధిలోని ఆరేపల్లి గ్రామం కూడా ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉందని సమాచారం.

అదే తరహాలో మరికొన్ని గ్రామాల్లో పదవుల వేలం కొనసాగుతున్నట్లు సమాచారం. మూడో విడత ఎన్నికలకు శనివారం మధ్యాహ్నం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియనున్నది. ఉదయం 11 గంటల వరకు చర్చలకు సమయం ఉన్నందున అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు పావులు కదుపుతున్నారు.

అధికారుల రాకతో బ్రేక్

మండల పరిధిలోని పిన్నంచర్లలో సర్పంచ్ స్థానానికి 8 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి అత్యధికంగా విరాళం ఇచ్చే వారిని సర్పంచ్‌గా ఖరారు చేసుకోవాలన్న ఆలోచనతో శుక్రవారం గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థి రూ. 30 లక్షలు విరాళం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పోటీలో ఉన్న తన భార్య పేరిట రూ. 45 లక్షలు ఇచ్చేందుకు సన్నద్ధమయ్యారు. కానీ విషయం తెలుసుకున్న మండల పరిషత్ అధికారి శ్రీపాద్, తహసీల్దార్ చాంద్‌పాషా, పంచాయతీ అధికారి శ్రీరామ్‌రెడ్డిలు గ్రామానికి చేరుకున్నారు. దీంతో సమావేశమైన నాయకులందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారి శ్రీపాద్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రైం కార్నర్

ఇసుక టిప్పర్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్

కృష్ణ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు బైరోడ్డు వద్ద జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా, అటుగా వచ్చిన ఇసుక టిప్పర్‌ను తనిఖీ చేశారు. కర్ణాటక రాష్ట్రంలోని మాన్వి నుంచి సైదాపూర్‌కు బైరోడ్డు మీదుగా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ బుగ్గప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీద్ తెలిపారు.

పాఠశాలలో వంట సామగ్రి ధ్వంసం



పాఠశాల గదిలో ధ్వంసమైన వంట సామగ్రి

వనపర్తి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని చందాపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు వంట సామగ్రిని ధ్వంసం చేశారు. వంట గది సరిగా లేక పోవడంతో సమగ్రిని ఒక తరగతి గదిలో సామగ్రిని ఉంచారు. గది కిటికీకి ఒక రెక్క లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు అందులో నుంచి రాళ్ల విసిరి వంట సామగ్రిని ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం వంట పనివారు గమనించి ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. ఈ విషయంపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో, రేషన్ బియ్యం

అచ్చంపేటటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లై అధికారి హెమ్లా తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో కొత్త రఘు అనే వ్యక్తి ఇంట్లో అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. అక్కడ నిల్వ చేసిన 3 క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రఘుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సిద్ధాంహుస్సేన్ తెలిపారు.

అంతకుమించి..

(5వ పేజీ తరువాయి)

కాకపోయినప్పటికీ, పోటీ తీవ్రం కావడం వల్ల ఖర్చుకు వెనుకాడే పరిస్థితి లేదని చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో ఆర్థికంగా లేని అభ్యర్థులు అప్పులు చేస్తుండగా, ఆస్తిపాస్తులు ఉన్నవారు వాటిని అమ్ముకుంటున్నారు. రెవెన్యూ ఎక్కువగా ఉండే మేజర్ పంచాయతీల్లో ఖర్చు రూ.కోటి దాటుతుందని అంచనా వేస్తున్నారు. ఎంత చిన్న పంచాయతీ అయినా సర్పంచు అభ్యర్థికి రూ.5 లక్షలపైనే చేతి చమురు వదలనుంది. ఈ పోటీ ఆర్థికంగా లేనివారికి కొంత కష్టంగా మారనుంది. వారు ఎలాగైనా నెగ్గాలని భావిస్తున్నప్పటికీ, డబ్బులు ఎలా సమకూర్చుకోవాలో సతమతమవుతున్నారు.

ఈగోతోనే తంటాలు..

సాధారణంగా గ్రామ పంచాయతీల్లో పోటీ రసవత్తరంగా ఉంటుంది. అందరూ తెలిసిన వారే అయినప్పటికీ ఏళ్లుగా పార్టీల వారీగా, సందర్భాల వారీగా, వివిధ విభేదాల వల్ల గ్రామాల్లో పోటీపడుతున్న వారు ఉంటారు. పార్టీలు కూడా అలాంటి వారికే మద్దతు ఇచ్చి గెలిపిస్తాయి. ఈ క్రమంలో కేవలం ఈగోలకు పోయి ఈసారి పంచాయతీ ఎన్నికల్లో అధిక ఖర్చుకు వెనుకాడటం లేదు. ఓడిపోతే పరిస్థితి ఏంటి? ఇంత ఖర్చు పెట్టి ఏం చేయగలం?, ప్రభుత్వాల నుంచి సమయానుకూలంగా నిధులు రాకుంటే ఎలా? అనే విషయాలను అస్సలు పట్టించుకోవడం లేదు. అవతలి పార్టీ వ్యక్తిపైనా లేదా అదే పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న మరో రెబల్‌పైన పంతం నెగ్గించుకోవాల్సిందేనని సంకల్పిస్తున్నారు. కొందరు విదేశాల నుంచి వచ్చి మరీ నామినేషన్లు వేసి బరిలో నిలిచారు.

గెలిచిన తర్వాతే డబ్బులు..

ఏ ఎన్నిక వచ్చినా అధినాయకుల వద్ద ఖర్చు కోసం ఆశపడటం స్థానిక అభ్యర్థుల్లో కనిపిస్తుంది. అది కూడా ఆర్థికంగా లేక, బరిలో నిలవాలనుకునే వారి నుంచే ఈ ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. కానీ ఈసారి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు డబ్బులు అడిగితే ఆముదం పూసుకున్నట్లు జారుకుంటున్నారు. గెలిచిన తర్వాతనే డబ్బులు, అభివృద్ధికి నిధులు ఇస్తామని చెబుతున్నారు. అధికార పార్టీకి మెజారిటీ గ్రామాల్లో ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఉండటంతో ఎవరికి ఇచ్చినా గ్రామంలో తనకు ఇబ్బంది ఎందుకనే ధోరణి కనిపిస్తోంది. అయితే ఈగోకు పోయి పోటీ పడుతుండటం, కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు చెప్పినా వినకపోవడంతో గెలిచిన తర్వాత రావాలని చెబుతున్నారు. ఇక ఏకగ్రీవ పంచాయతీలకు సంబంధించి ఏ గుర్తు లేకపోవడంతో కొందరు అధికారపార్టీ అని చెబుతుండగా.. మరికొందరు బీఆర్ఎస్ అని చెబుతున్నారు. ఒకసారి చెప్పిన మాట మరోసారి ఉండటం లేదు. ఈ శిబిరం నుంచి ఆ శిబిరంలోకి వెళ్తున్నారు. ఎవరు ఎక్కువ ఇస్తానంటే వారి వైపు మళ్లే పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికలు పూర్తయ్యే సమయానికి ఎవరు ఏ పార్టీలో ఉంటారో తేలనుంది.

కనుల పండువగా మహా రథోత్సవం

- జనసంద్రంగా మల్దకల్, చిన్నరాజమూర్

మల్దకల్/ దేవరకద్ర/ దామరగిద్ద, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూరులలో రథోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. మల్దకల్ మండల కేంద్రంలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం రాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు నిర్వహించిన మహారథోత్సవం కనుల పండువగా కొనసాగింది. ఉత్సవాన్ని తిలకించేందుకు మన రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. గురువారం సాయంత్రం నుంచి రథోత్సవం ప్రారంభమయ్యే వరకు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆ తర్వాత అర్చకుల ఆధ్వర్యంలో, పురప్రముఖుల సమక్షంలో రథం ఊరేగింపు ఆలయం నుంచి దశమికట్ట వరకు కొనసాగింది. వేలాది మంది భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపివేశారు. దీంతో భక్తుల రాకపోకలు సాఫీగా కొనసాగాయి.

● మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఆంజనేయస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో అర్చకులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆ తర్వాత విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించిన రథంపై ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గ్రామంలో ఊరేగించారు. ఉత్సవానికి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి దాసంగాలు సమర్పించారు. కోనేటిలో స్నానం చేసి, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవంలో పాల్గొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, మండల నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, కోనరాజశేఖర్, భరత్‌కుమార్, ప్రేమ్‌కుమార్, గోపాల్, గోవర్ధన్ ఉన్నారు. జాతర మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో భక్తుల సందడి కనిపించింది. భక్తులకు అవసరమైన అన్ని వసతులు కల్పించినట్లు ఈవో శ్యాంసుందర్‌చారి, చైర్మన్ గోపాలచారి తెలిపారు. అర్చకులు అన్వేషాచారి, రాఘవేంద్రాచారి, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



చిన్నరాజమూరులో ఆంజనేయస్వామి రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే, భక్తులు



మోతక్‌పల్లిలో బలభీమసేన రథాన్ని లాగుతున్న భక్తులు

మోతక్‌పల్లిలో పూలతేరు

నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల సరిహద్దు, కర్ణాటకలోని మోతక్‌పల్లిలో బలభీమసేన బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం అర్ధరాత్రి మహారథోత్సవం నిర్వహించారు. ముందుగా పూలతేరుపై స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు, పురప్రముఖులు తేరును లాగారు.

వరి పంటపై గడ్డి మందు పిచికారి

- రాజోలి పోలీసులకు రైతు ఫిర్యాదు



ఎండిపోయిన వరి పైరును చూపుతున్న రైతు పెద్ద రంగస్వామి

రాజోలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చేతికొచ్చే దశలో వరి పంటపై ఓ వ్యక్తి గడ్డి మందు పిచికారి చేయడంతో పైరు ఎండిపోయింది. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని నసనూర్ గ్రామంలో జరిగింది. బాధిత రైతు కుర్వ పెద్ద రంగస్వామి, ఎస్ఐ గోకారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైతు రంగస్వామి ఎకరా పొలంలో సాగు చేసిన వరిపైరు ఇటీవల ఎండిపోయింది. ఆరా తీయగా, అదే గ్రామానికి చెందిన భూషణ్‌గౌడు అనే వ్యక్తి వరి పైరుపై గడ్డిమందు పిచికారి చేసినట్లు గుర్తించాడు. అతడిపై చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని కోరుతూ రైతు రంగస్వామి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గోకారి తెలిపారు.

ఇంటర్వ్యూ..

వాతావరణ మార్పులతో వ్యాధులకు అవకాశం

- ప్రభు, సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్



అచ్చంపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శీతాకాలంలో వాతావరణ మార్పుల వల్ల పొంచి ఉన్న సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభు అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

దవాఖానలో ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు ?

అన్ని రోగాలకు వైద్యం అందిస్తున్నాం. ప్రస్తుతం ఆసుపత్రిలో స్టాఫ్ సమస్య లేదు. వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాం. ఆర్థో వైద్యులు లేకపోవడంతో ప్రస్తుతం అలాంటి కేసులను జిల్లా ఆసుపత్రికి పంపిస్తున్నాం. ఆసుపత్రిలో రోజుకు 18నుంచి 20 డయాలసిస్ కేసులు చేస్తున్నాం.

పాము కాటు వ్యాక్సిన్ అందుబాటులో ఉందా ?

ఆసుపత్రిలో పాము కాటుతోపాటు కుక్క కాటుకు కూడా వ్యాక్సిన్ ఉంది.


కాన్పుల కోసం వచ్చేవారికి సౌకర్యాలు ఎలా ఉన్నాయి ?

సివిల్ ఆసుపత్రికి గర్భిణులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం. గత నెలలో 60 ఆపరేషన్లు, 24 సాధారణ ప్రసవాలు చేశాం. గైనాకాలజీ వైద్యులు లేకున్నా కాన్పుల కోసం వచ్చేవారికి సకాలంలో వైద్యం అందిస్తున్నాం.

న్యూస్ బాక్స్

ఎన్నికలకు పటిష్ట భద్రత

- డీఎస్పీ వెంకట్‌రెడ్డి



కోనాపూర్‌లో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

వంగూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని రంగాపూర్, కోనాపూర్, చౌదర్‌పల్లి సమస్యాత్మక గ్రామాలను డీఎస్పీ పరిశీలించారు. పోలింగ్‌రోజు సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆయన సూచించారు. పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రత కల్పిస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. ఆయన వెంట సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ మహేష్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి అందుబాటులోకి పోస్టల్ బ్యాలెట్ కేంద్రం

తాడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో ఉద్యోగస్తులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ శనివారం నుంచి మూడు రోజుల పాటు ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

వృథా అవుతున్న తాగునీరు



తాడూరులో రోడ్డుపై పారుతున్న నీరు

తాడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు సమీపంలో తాగునీటి పైపులైన్లకు సంబంధించిన మ్యాన్‌వాల్ కొన్ని రోజులుగా నీళ్లలీకవుతున్నది. పైపుల నుంచి నీరు బయటకు వస్తుండడంతో నాగర్‌కర్నూల్-కల్వకుర్తి ప్రధాన రహదారిపై నీరంతా వృథాగా ఎక్కిపారుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్లను సరి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు అంబేడ్కర్ వర్ధంతి

అచ్చంపేటటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నేడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో నిర్వహించే వేడుకలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని అంబేడ్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు పాత్కుల శ్రీశైలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొంటారన్నారు. మన బతుకులను మన తలరాతను మార్చిన మహనీయుడు బాబాసాహెబ్ అంబేడ్కర్ అన్నారు. నియోజవకర్గంలోని అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నామినేషన్ల ఉపసంహరణ

పెంట్లవెల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సర్పంచు ఎన్నికల్లో నామినేషన్ వేసిన అభ్యర్థులు కొంత మంది శుక్రవారం తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. పెంట్లవెల్లిలో ఆరు వార్డు సభ్యులు, ఒక సర్పంచు అభ్యర్థి ఉపసంహరించుకున్నారు.యంగంపల్లి తండాలో ముగ్గురు వార్డు సభ్యులు, ఒక సర్పంచు అభ్యర్థి ఉపసంహరించుకున్నారని ఎంపీడీవో భాస్కరాచారి తెలిపారు.

సూచిక బోర్డులు కరువు.. ప్రమాదాలకు నెలవు



దేవునితిర్మలాపూర్ నుంచి వెన్నచెర్ల రహదారిపై ఉన్న మలుపు

- ప్రమాదకరంగా రోడ్లపై మలుపులు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- ఇబ్బందుల్లో వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారులపై ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలు మాత్రం శూన్యం. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ప్రధాన రహదారులపై పలుచోట్ల అనేక ప్రమా దకరమైన మలుపులు ఉండడంతో ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. మలుపుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్దకొత్తపల్లి నుంచి దేవునితిర్మలాపూర్ గ్రామానికి వెళ్లే రహదారిపై వెన్నచెర్ల నుంచి దేవునితిర్మలాపూర్ వెళ్లే రహదారిపై పెద్దకార్పాముల నుంచి మరికల్ వెళ్లే రహదారిపై పెద్దకార్పాముల నుంచి వయా నాయినోనిపల్లి మీదుగా యాపట్లకు వెళ్లే రహదారులపై ఇలా అనేక చోట్ల మలుపులు ప్రమాద భరితంగా ఉన్నాయి. ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి దాపురించింది. ఎత్తు పల్లాలతో ఉండే ఈ రహదారులపై ఎన్నోచోట్ల మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల దగ్గర అనేక మార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. మలుపుల దగ్గర అధికారులు సూచికబోర్డులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మలుపుల వద్ద రోడ్డు కిరువైపులా పెద్ద పెద్ద వృక్షాలు ఉండడం వలన రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు కనబడడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి మలుపుల దగ్గర రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులపై మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల దగ్గర ఎన్నో మార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని మలుపుల దగ్గర సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

- మేకల మల్లేష్, నక్కలపల్లి

భక్తిశ్రద్ధలతో లలితసహస్ర పారాయణం



లలితసహస్ర పారాయణంలో పాల్గొన్న భక్తులు

కందనూలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తాలో గల శ్రీజ్ఞాన సరస్వతి దేవాలయంలో శుక్రవారం లలితా సహస్ర పారాయణ పఠనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జ్ఞాన సరస్వతి పారాయణ కమిటీ సభ్యులు పఠనం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు నవీన్‌కుమార్‌శర్మ తెలిపారు. భక్తులు సామూహికంగా లలితా సహస్ర పారాయణ పఠనం, మణిద్వీప, వర్ణన, లింగాష్టకం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు వేదఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలతో పాటు నిత్య అన్నప్రసాదశాలలో సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ. 5లక్షల విరాళం

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో గల సంతోషిమాత ఆలయ అభివృద్ధికి ఆకుతోట సురేష్, చంద్రకళ దంపతులు తమ పిల్లల పేరిటరూ.5లక్షల చెక్కును ఆలయ కమిటీ సభ్యులు భాగ్యమ్మ, శ్రీదేవి, రాజేశ్వరి, శివకుమార్లకు శుక్రవారం అందజేశారు. ఆలయ అర్చకులు అల్లాడి ప్రకాశ్ శర్మ దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాలతో సన్మానించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చనలు

అచ్చంపేటటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భ్రమరాంబికాదేవి ఆలయంలో మార్గశిర మాస పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆలయ అధ్యక్షుడు పోకల శ్రీధర్ ఆధ్వర్యంలో కుంకుమార్చన కార్యక్రమం మహిళలు, భక్తులు ఘనంగా నిర్వహించారు. భ్రమరాంబికా దేవి అమ్మవారికి అర్చకుడు ఉదయ్ భాస్కర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మృత్తిక రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ మదన్‌మోహన్

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మృత్తిక రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ అన్నారు. ప్రపంచమృత్తిక దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్య కారకాలు, నేల నాణ్యతను దెబ్బతీస్తూ జీవవైవిధ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మట్టి కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతీ పౌరుడు చురుకుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కోదండరాములు, ఉమాదేవి, రామకృష్ణతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడే వారిని గెలిపించండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్

కోడేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపోరాటాలు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న సీపీఎం బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగ ర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, సానుభూతి పరుల సమావేశం నిర్వహించారు. ఆయన మా ట్లాడారు. సీపీఎం బలపరిచిన సర్పంచు అభ్యర్థి పి.నరసింహతో పాటు వార్డు సభ్యులను గెలి పించాలని కోరారు. జిల్లాలో సీపీఎం అనేక పో రాటాలు నిర్వహించినందున భూ నిర్వాసితు లకు నష్టపరిహారం డబ్బులు అందాయన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వి.పర్వతాలు, ఆర్.శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, సీపీఎం మండల కార్యదర్శి పి.రవి, కాక వెంకటయ్య, సీపీఎం మండల నాయకులు శివశంకర్ పాల్గొన్నారు.

ముగిసిన మూడో విడత నామినేషన్లు

చారకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మూడవ విడత నామినేషన్లు మండలంలో శుక్రవారం ముగిశాయి. మండల వ్యాప్తంగా మూడవ రోజు 17 గ్రామ పంచాయతీలకు సర్పంచు స్థానాలకు 78 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 267 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మండలంలో మొత్తం 17 సర్పంచు స్థానాలకు113 మంది, 142 వార్డులకు గాను 375 మంది నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో శంకర్ నాయక్ తెలిపారు. మండలంలో నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చివరి రోజు ముమ్మరంగా..

అమ్రాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలంలోని 20 గ్రామ పంచాయతీలు, 182వార్డులకు గాను చివరి రోజు సర్పంచ్ అభ్యర్థులతోపాటు వార్డు సభ్యుల కు పోటీ చేసే వారు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని నామినేషన్లు వేశారు. శుక్రవారం సాయంత్రం 7:30గంటల వరకు కూడా అభ్యర్థులు లైన్లలో నిలబడి నామినేషన్లు దాఖలు చేయడం కన్పించింది.

కొనసాగుతున్న సేవ్ గచ్చుబావి శ్రమదానం

కల్వకుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని పురాతన గచ్చుబావి కోనేరు పునరుద్ధరణ సేవ్ గచ్చుబావి శ్రమదాన కార్యక్రమం ఉధృతంగా కొనసాగుతోంది. శుక్రవారం యువకులు, విద్యార్థులు, నాయకులు శ్రమదానంలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. గచ్చుబావిలోని పూడికను తీస్తున్నారు. గచ్చుబావిలోని పూడికతీత శ్రమదాన కార్యక్రమం నిరంతరాయంగా ప్రతీ రోజు ఉదయం కొనసాగుతుండడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, యువకులు తదితరులు ఉన్నారు.

రోడ్డు కోతతో తప్పని వెత



వర్షాలకు రోడ్డు కోతకు గురై ప్రమాదభరితంగా ఉన్న గుంత

వంగూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల రోడ్లు కోతకు గురై ప్రమాదభరితంగా మారాయి. మండలంలోని మాచినేనిపల్లి గ్రామ నుంచి డిండిచింతపల్లికి వెళ్లే రోడ్డులో మాచినేనిపల్లి గ్రామసమీపంలో ఉన్న లోలేవల్ వంతెనపై ఎగువ నుంచి నీరు వస్తుండడంతో దెబ్బతిని గుంత ఏర్పడింది. దీంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కమాల్‌పూర్ సర్పంచు ఏకగ్రీవం



నామినేషన్ దాఖలు చేస్తున్న సర్పంచు అభ్యర్థి రవికుమార్‌నాయక్

చారకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కమాల్‌పూర్ సర్పంచు ఎస్టీ జనరల్, 8 వార్డులకు గాను 4 ఎస్టీ జనరల్, 4 ఎస్టీ మహిళకు రిజర్వ్ అయ్యాయి. కమాల్‌పూర్ సర్పంచు స్థానానికి ఒక్కటి, వార్డు సభ్యుల స్థానానికి ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లను అభ్యర్థులు దాఖలు చేశారు. చివరి రోజు శుక్రవారం వరకు ఎవరు కూడా నామినేషన్లు వేయకపోవడంతో కమాల్‌పూర్ పంచాయతీలోని నూకలచింతవాడిక తండాకు చెందినరవికుమార్‌నాయక్ సర్పంచుగా, మరో 8మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు.

వైద్య శిబిరం విజయవంతం

మన్ననూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీప్రాంతంలోని మల్లాపూర్ చెంచుపెంటలో శుక్రవారం నిర్వహించిన పీఎం జన్‌మన్ వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్యాధికారి డాక్టర్ మోహన్‌పాల్ నాయక్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 25మంది చెంచులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, మధుమేహం, జ్వర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సు కావ్య, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, ఆరోగ్య సహాయకులు అంజనేయులు, అనంతస్వామి పాల్గొన్నారు.

బేసిక్ లైఫ్ సపోర్టుపై అవగాహన

కల్వకుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు బేసిక్ లైఫ్ సపోర్టుపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వివేకానంద కోరారు. శుక్రవారం మిలీనియం హైస్కూల్లో 'లెట్స్ సేవ్ లైవ్స్ టుగేదర్'లో భాగంగా బేసిక్‌లైఫ్ సపోర్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వివేకానంద విద్యార్థులకు ప్రాణాలు కాపాడే అత్యవసర విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థిక సహాయం

తిమ్మాజిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన రాములు అనే వ్యక్తి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బాల్యస్నేహితులు తమవంతుగా రూ.26వేలు జమ చేసి శుక్రవారం వారి ఇంటికెళ్లి అతని భార్య మారెమ్మకు అందజేశారు. అంతకు ముందు రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి చదువుకునే రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్నేహితుల్లో ఎవరికీ ఏ ఆపద వచ్చినా అండగా ఉండాలన్న నిర్ణయం తీసుకోవడంపై పలువురు అభినందనలు తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య, రాజగోపాల్‌రెడ్డి, శ్రీనయ్య, నరసింహ, శేఖర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ బోల్తా

కల్వకుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకలోడ్‌తో వెళ్తున్నటిప్పర్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన మండలంలోని లింగసానిపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ జి.మాధవరెడ్డి కథనం ప్రకారం.. ఉప్పునుంతల మండలం దాసర్లపల్లి సమీపంలోని దుందుభీ నది నుంచి అనుమతి లేకుండా అక్రమంగానే టిప్పర్‌లో ఇసుకను బాల్‌నగర్‌కు తీసుకెళ్లేందుకు బయల్దేరారు.మండలం లింగసానిపల్లి సమీపంలో బోల్తా పడింది. డ్రైవర్ దేవ్‌సింగ్‌కు గాయాలయ్యాయని ఎస్ఐ పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధికి పాటుపడేవారిని ఎన్నుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను అభివృద్ధి పరిచే వారినే సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. లింగాల మండలం అప్పాయిపల్లి గ్రామానికి చెందిన కాట్రావత్ సుజాతా రవీందర్ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఎమ్మెల్యే, అధికాలతో కలిసి పని చేయింకునేవారినే ఎన్నుకుందామని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాలలోనే ఎన్నో అబివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ప్రతిపక్ష పార్టీల మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. అధికారంలో ఉన్న పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే గ్రామం అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు నాయకులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

- ఎంపీడీవో ఆంజనేయులు

- గ్రామ పంచాయతీల స్టేజ్-2 ఆఫీసర్లకు శిక్షణ



స్టేజ్-2 ఆఫీసర్ల శిక్షణలో ఎన్నికల నిబంధనలు వివరిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు

తాడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 11వ తేదీన జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి చేయాలని ఎంపీడీవో ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోనిఎంపీడీవో కార్యాలయంలో 24 గ్రామ పంచాయతీలకు సంబంధించిన స్టేజ్-2 ఆ ఫీసర్లకు ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత అభ్యర్థుల గెలుపునకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు అందజేయడం, ఉప సర్పంచ్ ప్రక్రియ ఏ విధంగా కొనసాగించాలన్న అంశాలపై పూర్తిస్థాయిలో వివరించారు. అధికారులు ఎన్నికల విధులపట్ల అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసాచార్యులు, జోనల్ ఆఫీసర్ త్యాగరాజుగౌడ్, శివకృష్ణ, స్టేజ్-2 ఆఫీసర్లు, సీనియర్ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.

● బిజినేపల్లి, (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14న రెండో విడత సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు వెళ్లే అకారులకు శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీవో కతలప్ప తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల వ్యాప్తంగా ఉన్న 11 రూట్లకు 12 మంది జోనల్ అధికారులు, 27 మంది రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు.

● కల్వకుర్తి, (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యుల ఖర్చుల వివరాలను పకడ్బందీగా లెక్కించాలని ఎంపీడీవో వెంకట్రాములు కోరారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల బరిలో నిలిచే సర్పంచ్‌కు లక్షా 50వేల వరకు ఖర్చు చేయాలని, వార్డు సభ్యుడు రూ.30వేల వరకు ఖర్చు చేయాలని సూచించారు. అంతకన్నా ఎక్కువ ఖర్చు చేసే అనర్హులయ్యే అవకాశం ఉందని ఆయన సూచించారు. సమావేశంలో ఎంపీడీవో సూపరింటెండెంట్ యాదయ్య, ఎంఆర్ఐ రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

ఏకగ్రీవ సర్పంచ్ కిల్లె మల్లయ్యకు ఎమ్మెల్యే అభినందన



చేగుంట గ్రామంలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ కిల్లె మల్లయ్యను సన్మానించిన ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

తిమ్మాజిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చేగుంట గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కిల్లె మల్లయ్య, వార్డుసభ్యులను ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అభినందించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా వార్డు సభ్యులకు గాను ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలయ్యాయి. సర్పంచ్ అభ్యర్థిగా కిల్లెమల్లయ్య నామినేషన్ ఒకటే రావడంతో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా దాదాపు ఎన్నికై నట్లే. ఈ నెల 14 పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు. శుక్రవారం కిల్లె మల్లయ్య, సభ్యులతో పాటుగా పలువురు గ్రామస్థులు నాగర్‌కర్నూల్ వెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తానని వారిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్‌రెడ్డి, గిరిజాశంకర్, లోకేశ్వర్‌రెడ్డి, కిల్లె కొండయ్య, పట్నం నరసింహ, కదినే పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడిగానిపల్లిలో చోరీ

ఊర్కొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసు నమోదైన సంఘటన మండలంలోని గుడిగానిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుడిగానిపల్లి గ్రామానికి చెందిన ద్యాప రాఘవరెడ్డి తన భార్య శ్రీరేఖ అనారోగ్యంతో ఉండగా ఇంటికి తాళం వేసి ఈ నెల 2న హైదరాబాద్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. తిరిగి 4న ఊరికి రాగా ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోను దుస్తులు చిందరవందరగా ఉన్నాయన్నారు. దాంతో అనుమానం వచ్చి చూడగా రెండు తులాల బంగారం, 2 తులాల వెండి, నగదు రూ. 10,000/- గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిచారని తెలిపారు. దాంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

మద్యం పట్టివేత : కేసు నమోదు

ఊర్కొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం నుంచి రాచాలపల్లి, ఊర్కొండపేటకు తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. అదేవిధంగా రూ.15వేల మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మానసిక దివ్యాంగులతో సుహృద్భావంతో మెలగాలి

- డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య



మాట్లాడుతున్న శ్రీరామ్ ఆర్య

తెలకపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మానసిక దివ్యాంగుల పట్ల సుహృద్భావంతో మెలగాలని డిప్యూటీ చీఫ్ లిగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య అన్నారు. హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నాగర్‌కర్నూల్ చైర్మన్ ఆదేశాల మేరకు శుక్రవారం తెలకపల్లిలోని మహాత్మజ్యోతిబాఫూలే బీసీ గురుకుల పాఠశాలలో బాలికలకు నిర్వహించిన 'నాల్సా లీగల్ సర్వీసెస్ పర్సన్స్ విత్ మెంటల్ ఇల్నెస్ అండ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజిబులిటీస్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ వికలాంగులు తమ సమస్యల గురించి ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 14416కు ఫోన్ చేసి వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య అడ్వకేట్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులు... ఓ సారి ఇటు చూడండి



ఎత్తంలో ప్రధాన రోడ్డుపై ఒరిగిన 11 కేవీ విద్యుత్ స్తంభం

కోడేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎత్తం గ్రామంలో ప్రధాన రహదారిపై ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని అధికారులు ఒకసారి ఇటు చూడండని ప్రయాణికులు, గ్రామస్థులు కోరుతున్నారు. స్తంభం ఒరిగిపోయినా అధికారులు అటు వైపు చూడకపోవడం విచారకరం. విద్యుత్ స్తంభం 11 కేవీ వైర్లు ఉండడంతో ఏదైనా కారణం చేత స్తంభం కింద పడిపోతే ప్రదం జరిగి, ప్రాణనష్టం జరగనుంది. గ్రామంలో చాలా విద్యుత్ స్తంభాలు ఇలా ఉన్నాయని విద్యుత్ అధికారులకు కనిపించడం లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.